ప్రజాశక్తి

ఆదివారం 28 జనవరి 2024 5

శ్రీ సత్యసాయి

ముస్సిపల్ ఎంఈకి వినతిని ఇస్తున్న పారిశుధ్య కార్మికులు

కదిలొచ్చిన తమ్ముళ్లు

ఉరవకొండలో జరిగిన రా కదలిరా బహిరంగ సభలో ప్రసంగిస్తున్న చంద్రబాబు నాయుడు, హాజరైన టిడిపి కార్యకర్తలు

- ఉరవకొండ సభకు స్పందన
- జిల్లాకు వాగ్దానాలిచ్చిన చంద్రబాబు
- 'రా కదలిరా' సభ విజయవంతం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ చేపట్టిన 'రా కదలిరా' సభకు తెలుగు తమ్ముళ్లు కదిలొచ్చారు. టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు చేపట్టిన ఈ సభకు జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా తరలొచ్చారు. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అధ్యక్షతన జరిగిన సభ జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు అధికార వైసిపిపై విమర్శలు గుప్పిస్తూనే, తాము అధికారంలోకి వస్తే ఏమి చేయబోతున్నామన్న వాగ్దానాలు చేశారు. జిల్లాలోనున్న సమస్యలను ఆయన ప్రముఖంగా ప్రస్తావించారు. అదే సమయంలో అధికార వైసిపి ప్రజాప్రతినిధులపైనా ఆరోపణలు చేశారు. అనంతపురం జిల్లాకు సాగునీటికి అధిక ప్రాధాన్యతనిస్తామని హామీనిచ్చారు. ప్రతి ఎకరానికి నీరివ్వడమే తన లక్ష్యమని హామీనిచ్చారు. ఇది వరకే హంద్రీనీవా ప్రవాహ సామర్థ్యాన్ని పెంచే ప్రయత్నం చేసినట్లు గుర్తు చేశారు. అవి ఇప్పుడు మధ్యలోనే ఆగిపోయాయని వాటిని పూర్తి చేస్తామని తెలిపారు. అదే విధంగా బిందు తుంపెర సేద్యానికి అధిక ప్రాధాన్యతినిస్తామన్నారు. తెలుగుదేశం అధికారంలో నున్న సమయంలో ఉరవ కొండ నియోజక వర్గం పరిధిలో చేపట్టిన సాముహిక బింధు సేద్యం ప్రాజెక్టును ఈప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. రూ.30 కోట్ల విలువైన డ్రిప్ పరికరాలు వృథాగా పడి ఉన్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టును వైసిపి పూర్తి చేసి ఉంటే 50 వేల ఎకరాలకు సాగునీరందిందేని చెప్పారు. భైరవానితిప్ప, పేరూరు ఎత్తిపోతల పథకాలను తాము చేపడతామన్నారు. అనంతపురం జిల్లా వాణిజ్య పంటలకు అవనువైనదని చెప్పారు. బిసిలు అధికంగానున్న అనంతపురం జిల్లాలో వారికి దన్నుగా టిడిపి ఉంటుందని తెలిపారు. ఇదే సందర్భంలో అనంతపురం జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు సంబంధించిన ఎమ్మెల్యేలపైనా అవినీతి ఆరోపణలు అధికంగానున్నాయన్నారు. భూకబ్జాలు దౌర్జన్యాలు అధికమయ్యాయని ఆరోపించారు. బ్రహ్మసముద్రం మండలంలో శుక్రవారం నాడు జరిగిన మహిళపై దాడిని ప్రస్తావించారు. ఈ ఆరోపణలున్న ఎమ్మెల్యేలను పక్క నియోజకవర్గాలకు బదిలీ చేస్తే ప్రయోజనమేముంటుందని మంత్రి ఉషచరణ్ శ్రీని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. తప్పు చేసిన వారు ఎవరినీ తాము అధికారంలోకి వచ్చాక వదిలిబెట్టబోమని హెచ్చరించారు. ఈ కాలంలో టిడిపి కార్యకర్తలు అనేక ఇబ్బందులు ఎదుర్కొనారన్నారు. అయినా పార్టీకి అండగా నిలిచారన్నారు. అందరూ సమిష్టిగా కలపి ఈ 76 రోజులు పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. జనసేనను కలుపుకుని పనిచేయాలని సూచించారు. జిల్లా సమస్యలను ప్రస్తావించడంతోపాటు రాష్ట్ర వ్యాప్త సమస్యలపైనా మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ పాలనను నిశితంగా దుయ్యబట్టారు. ఆ సమయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను స్పందన కనిపించింది. మొత్తంగా టిడిపి సభ విజయవంతం కావడం పట్ల ఆ పార్టీ నేతల్లోనూ ఉత్సాహం నెలకొంది. చంద్రబాబు మాట్లాడటానికి ముందు పయ్యావుల కేశవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి అనంతపురం జిల్లా అధ్యక్షులు కాలవ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రను తిరగరాద్దాం : కేశవ్

ఉరవకొండ : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఉరవకొండ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో టిడిపి జెండాను ఎగురవేసి చరిత్రను తిరగరాద్దామని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ అన్నారు. ఉరవకొండలో నిర్వహించిన రాకదలిరా బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. 1994వ సంవత్సరంలో ఉరవకొండ నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలో కూడా తెలుగుదేశం పార్టీ గెలిచి ప్రభంజనం సృష్టించి అధికారాన్ని చేపట్టిందని గుర్తు చేశారు. 2024లో అదే పునరావృతం కాబోతోందన్నారు. నారా చంద్రబాబు నాయుడు సహకారంతో నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు.

రాత్రికి ఉరవకొండలోనే బస

ఉరవకొండ సభ అనంతరం టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు రాత్రికి అక్కడే బస చేశారు. ఆదివారం ఉదయం ఇక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి నెల్లూరుకు వెళ్లనున్నారు

డిమాండ్ల ఆమోదంపై
జీవో విడుదల చేయాలి

ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జగదీష్

ప్రజాశక్తి-హిందూపురం

నిరవధిక సమ్మెలో భాగంగా ప్రభుత్వం మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం, సిఐటియుతో జరిపిన చర్చల ఆమెదానికి ప్రభుత్వం వెంటనే జీవో జారీ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు జగదీష్ డిమాండ్ చేశారు. జీవో విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ పారిశుధ్య కార్మికులు పట్టణంలోని ఇందిరా పార్కు నుంచి మున్సిపల్ కార్యలయం వరకు శనివారం నాడు ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఛాంబర్ ముందు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరవధిక సమ్మెలో భాగంగా 16 రోజులపాటు పారిశుధ్య, ఇంజనీరింగ్ కార్మికులు డిమాండ్ల సాధన కోసం ఆందోళన నిర్వహించారన్నారు. మున్సిపల్ కార్మిక నాయకులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపి 16 రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వం జీవో జారీ చేయకపోవటంతో కార్మికుల ఆందోళన చెందుతున్నారని అన్నారు. చర్చల సందర్భంగా పారిశుధ్య కార్మికులకు రూ.21వేలు వేతనం, ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్, సెమిస్కిల్డు వేతనాలు, పార్క్ వర్కర్లకు హెల్త్ అలవెన్స్, పారిశుధ్య విభాగ డ్రైవర్లకు రూ.24,500 వేతనం, మరణించిన కార్మికులకు మట్టి ఖర్చులు రూ. 20 వేలు, రెగ్యులర్ కార్మికులకు బకాయి ఉన్న మూడు సంవత్సరాల సరెండర్ లీవ్, కరోనా సమయంలో పనిచేసిన, మలేరియా, గార్బేజ్ కార్మికులకు పని భద్రత కల్పిస్తూ రూ.15 వేలు వేతనం, అలాగే రిటర్మెంట్ బెనిఫిట్ స్కీమ్స్, సమ్మె కాలపు వేతనం చెల్లిస్తామని చర్చల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందన్నారు. చర్చల్లో ఒప్పుకున్న వాటిపై జీవోను విడుదల చేచాలన్నారు. లేనిపక్షంలో మళ్లీ నిరవధిక సమ్మెలోకి వెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ పట్టణ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, నాయకులు రామచంద్ర, గురునాథ్, శంకర నారాయణ, నాగేంద్ర, బాబయ్య, చంద్రశేఖర్, శ్రీరాములు, సుబ్బలమ్మ, శోభమ్మ, ఓబులమ్మ, కవితమ్మతో పాటు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్

జడ్జికి పుష్పగుచ్చం అందిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు జడ్జి కె.మన్మధరావును కలెక్టర్ అరుణ్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం నాడు ప్రశాంతి నిలయం శాంతిభవన్ అతిథి గృహంలో బసచేసిన జడ్జిని కలెక్టర్ కలిసి పుష్పగుచ్చం అందించారు. జడ్జి శుక్రవారం రాత్రి ప్రశాంతి నిలయానికి చేరుకుని, శనివారం ఉదయం కుల్వంత్ హాలులో సత్యసాయి బాబా మహాసమాధిని దర్శించుకున్నారు. జడ్జిని కలిసిన వారిలో పుట్టపర్తి మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి రాకేష్ పోలీసు అధికారులు ఉన్నారు.

లేపాక్షి ఆలయం సందర్శన

లేపాక్షి : ప్రసిద్ధిగాంచిన శ్రీ దుర్గావీరభద్ర స్వామి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి మన్మథరావు కుటుంబ సభ్యులతో సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి, ఆలయ విశిష్టతను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్, జిల్లా అదనపు జడ్జి శైలజ, హిందూపూర్ సివిల్ జడ్జి రాజ్యలక్ష్మి, ఎంఆర్ఒ బాబు, ఎండోమెంట్ ఆలయ ఈవో నరసింహమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాగరాజు, వైస్ ప్రెసిడెంట్ మున్సిపల్ లీగల్ అడ్వయిజర్ వన్నూరప్ప, సుదర్శన్, సిద్ధు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో ఆందోళన చేపట్టిన మహిళలు

తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ శనివారం మండలంలోని గౌనిపల్లిలో మహి ళలు ప్రధానరహదారిపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పను ల్లో భాగంగా తాగు నీటి పైపులైన్ దెబ్బతినడంతో కొన్ని నెలలుగా గ్రామంలో నీటి సమస్య తీవ్రమైంద న్నారు. ఈ విషయం అధికారులకు తెలిపినా ఫలితం లేదని వాపోయారు. సమస్యను పరిష్కరించేంత వరకూ ఆందోళన విరమించేది లేదని రోడ్డుపై బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభిం చింది. చివరికి జమే దారు వెంకటేష్ సంఘటనా స్థలానికి చేరుకొని, రోడ్డు పనులు చేపట్టిన కాంట్రాక్టర్ వారితో మాట్లాడి సమస్యను పది రోజుల్లోగా పరిష్కరిస్తారని హామీ ఇవ్వడంతో మహిళలు ఆందోళన విరమించారు.

విద్యార్థులతో వివరాలను వెల్లడిస్తున్న పాంచజన్య శ్రీనివాసులు

పాంచజన్య విద్యార్థికి జాతీయస్థాయిలో ప్రథమ ర్యాంకు

విద్యార్థి ముస్తఫాకు యుకె నుంచి పిలుపు

ప్రజాశక్తి-హిందూపురం

నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలియన్స్ ఇండియా(ఎన్ఐఎస్ఎ) జాతీయస్థాయిలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఎన్ఎఏటి-2023 పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షల్లో పాంచజన్య పాఠశాలకు చెందిన 4వ తరగతి విద్యార్థి ముస్తఫా జాతీయ స్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించారు. ఈ విషయంపై శనివారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో పాఠశాల యాజమాన్యం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపక అధ్యక్షులు పాంచజన్య శ్రీనివాసులు, సెక్రటరీ నందకుమార్‌లు మాట్లాడుతూ నేషనల్ ఇండిపెండెంట్ స్కూల్ అలియన్స్ ఇండియా జాతీయస్థాయిలో ఎన్ఏఏటీ 2023 పరీక్షలను నిర్వహించారన్నారు. తమ పాఠశాలలో పరీక్షల్లో పాల్గొన్న విద్యార్థుల్లో 25 మంది మంచి ర్యాంకులు సాధించారన్నారు. ఇందులో 4వ తరగతిలో జాతీయ స్థాయిలో ముస్తఫా మొదటి స్థానం సాధించగా, 3వ తరగతి విద్యార్థిని రిధ ఫాతిమా రెండవ స్థానంలో నిలిచిందన్నారు. వీరితో పాటు జాతీయ స్థాయిలో నాల్గవ ర్యాంకు ముగ్గురు విద్యార్థులు, ఐదవ ర్యాంకు ముగ్గురు, ఆరవ ర్యాంకు ఆరు మంది, ఏడవ ర్యాంకు ముగ్గురు, ఎనిమిదవ ర్యాంకు ఒక విద్యార్థి, తొమ్మిదవ ర్యాంకు నలుగురు, పదవ ర్యాంకు ఒకరు, 13వ ర్యాంకు ఒకరు, 21 ఒక విద్యార్థి ర్యాంకులు సాధించారన్నారు. జాతీయస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించిన విద్యార్థి ముస్తఫాకు యునైటెడ్ కింగ్డమ్ (యూకె) నుంచి పిలుపు వచ్చిందన్నారు. త్వరలో విద్యార్థి యూకేలోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయంలో ప్రథమ బహుమతిని అందుకోనున్నారని చెప్పారు. జాతీయస్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించిన రిధా ఫాతిమాతో పాటు మరిన్ని ర్యాంకులు సాధించిన వారందరికీ ఆంధ్రప్రదేశ్ లోనే నిసా (ఎన్ఐఎస్ఏ), అపుస్మ (ఏపిపియుఎస్ఎమ్ఏ) సంయుక్తంగా సంయుక్తంగా ప్రశంస పత్రాలతో పాటు నగదు బహుమతులు అందజేస్తారన్నారు. పాఠశాలలో చదువుతో పాటు అన్ని పోటీ పరీక్షలకు సంబంధించి ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతోనే తమ పాఠశాల విద్యార్థులు అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతున్నారని అన్నారు. ఈ సమావేశంలో పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్లు స్మిత, నందిత, హెచ్ఎం గాయత్రి, ఏవో భాస్కర్, సూపరిటెండెంట్ విజయేంద్ర, ఎహెచ్ఎంలు శశికళ, సతీష్ కుమార్, షేక్ అబ్దుల్ రజాక్‌తో పాటు ప్రథమ, ద్వితీయ ర్యాంకులు సాధించిన ముస్తఫా, రిదా ఫాతిమాలు పాల్గొన్నారు.

లెటర్ రైటింగ్‌లో ఎల్ఆర్‌జి విద్యార్థిని ప్రతిభ
రాష్ట్రస్థాయిలో ప్రథమ బహుమతి

విద్యార్థినికి చెక్కును అందిస్తున్న హెచ్ఎం ప్రసాద్, పోస్టల్ అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

యూనివర్సల్ పోస్టల్ యూనియన్ నిర్వహించిన అంతర్జాతీయ లెటర్ రైటింగ్ కాంపిటీషన్ (2023-24)లో ఆంధ్రప్రదేశ్ సర్కిల్ లెవెల్‌లో కిరికెరలోని ఎల్ఆర్‌జి విద్యాలయం విద్యార్థిని ఎన్ఎస్ సౌమ్య రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి అందుకున్నందని పాఠశాల హెచ్ఎం ప్రసాద్ తెలిపారు. 75వ గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పెనుగొండ సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్‌పెక్టర్ విమల్ కుమార్, పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ డెవలప్మెంట్ ఆఫీసర్ నరసింహమూర్తి, కిరికెర సబ్ పోస్ట్ మాస్టర్ జె. శ్రీనివాసులు పాల్గొని విద్యార్థిని సౌమ్యకు రూ.25వేల చెక్కుతో పాటు సర్టిఫికెట్ ను ప్రధానం చేశారు. బహుమతి గెలుచుకున్న సౌమ్యను పాఠశాల హెచ్ఎం ప్రసాద్‌తో పాటు సెక్రటరీ బాల సుందరం, ఏవో సంజీవరెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

వాహనదారులకు హెల్మెట్‌తో ప్రాణరక్ష

అవగాహన ర్యాలీలో ఎస్పీ మాధవరెడ్డి

ర్యాలీలో మాట్లాడుతున్న ఎస్పి మాధవ్‌రెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి ద్విచక్ర వాహనదారులూ స్వచ్ఛందంగా హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలు కాపాడుకోవాలని ఎస్పీ మాధవరెడ్డి సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రవాణా శాఖ ఆధ్వర్యంలో జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా శనివారం పట్టణంలో జరిగిన అవగాహన ర్యాలీని ఎస్పి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం వల్లే ప్రాణ నష్టాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలన్నారు. బైకులు నడిపే ప్రతి ఒక్కరూ నియమాలు పాటించాలన్నారు. హెల్మెంట్ తప్పక ధరించి వెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నియమాలు పాటించడం హెల్మెట్ ధరించడం, సీట్ బెల్టు వేసుకోవడం వల్ల తప్పనిసరిగా ప్రమాదాలు నివారించవచ్చన్నారు. జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు పకడ్బందీగా సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. రహదారి బాధ్యత మన అందరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌టిఒ కరుణసాగర్ రెడ్డి, పోలీస్, రవాణా శాఖ అధికారులు, పట్టణంలోని ద్విచక్ర వాహన షోరూం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తూముకుంట చెక్‌పోస్టు తనిఖీ చేసిన ఎస్‌పి

హిందూపురం కర్ణాటక సరిహద్దులో ఏర్పాటు చేసిన తూముకుంట చెక్‌పోస్టును ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్రమ రవాణా వాహనాల తనిఖీలు, అక్రమ మద్యం అడ్డుకట్టకు చేపట్టాల్సిన చర్యలు, ఏ విధంగా తీసుకుంటున్నారని ఆరా తీశారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేయాలని సిబ్బంది నిర్లక్ష్యంగా ఉండకూడదని అక్రమ రవాణా, అక్రమ మద్యంకు పూర్తిగా అడ్డుకట్ట వేయాలని చెక్ పోస్ట్‌లో ఉన్న అధికారులకు ఎస్‌పి ఆదేశించారు.

సంక్షేమ పాలనకు మద్దతివ్వండి : మంత్రి

మంత్రికి పూలమాలతో స్వాగతం పలుకుతున్న వైసిపి శ్రేణులు

ప్రజాశక్తి -పెనుకొండ

సిఎం జగన్ సంక్షేమ పాలనకు మద్దతివ్వాలని మంత్రి, పెనుకొండ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెవి.ఉషశ్రీ చరణ్ కోరారు. ఆమె శనివారం మండలంలోని నాగలూరు, బండ్లపల్లి, అడదాకులపల్లి, గోనిపెంట గ్రామాల్లో ఆత్మీయ పలకరింపు కార్యక్రమం చేపట్టారు. ఆయా గ్రామాల్లో మంత్రికి పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి మాట్లాడుతూ 'జన్మభూమి కమిటీలు వద్దు.. జగనన్న పాలనే ముద్దు' అని ప్రజలకు పిలుపునిచ్చారు. అన్ని పార్టీల జెండాలు జత కలిశాయన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బాబు, ఎంపీపీ గీతరామ్మో హన్‌రెడ్డి, నాయకులు సుధాకర్‌రెడ్డి, కోడిపల్లి గోవర్ధన్‌రెడ్డి, శ్యామ్‌నాయక్, కార్యకర్తలు పాల్గొన్నారు.

గంగంపల్లి పంచాయతీలో చరణ్‌రెడ్డి ప్రచారం

గోరంట్ల రూరల్ : సిఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని మంత్రి ఉషశ్రీ భర్త చరణ్‌రెడ్డి పేర్కొన్నారు. 'ఆత్మీయ పలకరింపు'లో భాగంగా శనివారం ఆయన గంగంపల్లి గ్రామపంచాయతీలోని గోపిదేవరపల్లి, దాసిరెడ్డిపల్లి తండా, ఎగువగంగంపల్లి, కొండ్రెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి వెంకట కృష్ణారెడ్డి, ఎంపీటీసీ వెంకట రంగారెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, వాసుదేవరెడ్డి, కేశవరెడ్డి, శంకర్‌రెడ్డి, ఉపసర్పంచి రాజారెడ్డి, పాటూరి శంకర్‌రెడ్డి, నార్సింపల్లి శివారెడ్డి, హరినాథ్‌రెడ్డి, కాంగారెడ్డిపల్లి గోవింద రెడ్డి, గంపల రమణారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, శీనానాయక్, సాయి, నాగరాజు పాల్గొన్నారు.

నేతల తాకిడి

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఎన్నికలకు సమయం ముంచుకొస్తున్న కొద్దీ నేతల తాకిడి పెరుగుతోంది. ఈవారంలో మూడు రాజకీయ పార్టీల అధ్యక్షులు జిల్లాకు విచ్చేశారు. మొన్న సిఎం జగన్ రాగా, నిన్న టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు వచ్చారు. నేడు కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల రానుంది. ఇలా వరుసగా ఒకరి తరువాత ఒకరు జిల్లాకు వస్తున్నారు. దీంతో జిల్లాలో రాజకీయ వాతావరణం వెడెక్కుతోంది. విమర్శలు, ప్రతివిమర్శలు పార్టీలు, నేతల మధ్య జోరందుకున్నాయి. కొన్ని రోజుల్లో నోటిఫికేషన్ రానుండటంతో ఇవి మరింత జోరందుకోనున్నాయి. ఈనెల 24న సిఎం జగన్ ఉరవకొండకు వచ్చిన సమయంలో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరిస్తూనే ప్రతిపక్షాలపై విమర్శలు సంధించారు. అందరూ కూడబలుక్కుని వైసిపిని ఓడించే ప్రయత్నాలు చేస్తున్నారంటూ విమర్శలు చేశారు. తనకు వ్యతిరేకంగా మూకుమ్మడి క్యాంపెయిన్ నడుస్తోంద న్నారు ఆయన తర్వాత అదే ఉరవకొండకు టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు విచ్చేశారు. వాటికి సమాధానంగా ఆయన ప్రతి విమర్శలు చేశారు. ప్రభుత్వాన్ని వ్యతిరేకించే వారందరినీ ఒక గాటికి కట్టేసే ప్రయత్నం సిఎం జగన్ చేస్తున్నారని మండిపడ్డారు. ఇక నేడు వైఎస్.షర్మిల వస్తుండటం మరింత ఆసక్తికరంగా మారుతోంది. ఎందుకంటే ఇప్పటికే సగం స్థానాలకు వైసిపి టిక్కెట్లు ఖరారు చేసిన నేపథ్యంలో అవి దక్కని వారు ప్రత్యామ్నాయ పార్టీల వైపు చూస్తున్నారు. ప్రధానంగా రాయదుర్గం కాపు రామచంద్రారెడ్డి, వైసిపి నుంచి సస్పెండ్ అయిన మధుసూదన్‌రెడ్డి తదితరులు కాంగ్రెసులో చేరుతారన్న ప్రచారం నడుస్తోంది. ఆదివారం జరిగే పర్యటన వారు చేరుతారా ఇంకా వేచి చూస్తారా అన్నది కూడా చూడాల్సి ఉంది. ఇలా మూడు ప్రధాన పార్టీల అధ్యక్షులతో ఈ వారం రాజకీయ వాతావరణం వాడివేడిగా సాగింది. ఈ వేడి రాబోయే రోజుల్లోనూ మరింత పెంచే అవకాశాలు కనిపిస్తున్నాయి. జిల్లాలోని ప్రజాప్రతినిధులు, నేతలు కూడా ఈ పర్యటనలను నిశ్చితంగా పరిశీలిస్తున్నారు. వారున్న పార్టీల్లో టిక్కెట్లు దక్కకపోతే మరో మార్గం ఎంచుకుంటే ఎలాగుంటుందన్న బేరీజులు వేసుకునే పనిలో బిజీబిజీగా ఉంటున్నారు. సమయం కూడా ఆసన్నమవుతుండటంతో ఎటోవైపు రాజకీయ అడుగులు వేయాల్సిన పరిస్థితులు నెలకొంటు న్నాయి. ఇక ఖరారైన వారు తమ నియోజకవర్గాల్లో పనిని మొదలుపెట్టుకునే పనిలో ఉన్నారు. ఆయా నియోజకవర్గాల్లో పరిచయ కార్యక్రమాలు కొత్తవారు చేసుకుంటుండగా, పాతవారు ప్రజల్లోకి చేరువ య్యేందుకు కసరత్తులు ముమ్మరం చేస్తున్నారు. అందుకు అవసరమైన అన్ని రకాల వనరులను సిద్ధం చేసుకునే పనిలో పడ్డారు. ఇంకో వైపు అధికార యంత్రాంగం ఎన్నికలకు సమయత్తమవుతోంది. ఇప్పటికే బదిలీల ప్రక్రియ మొదలైంది. తహశీల్దార్, ఎంపిడిఒలను ఇక్కడి నుంచి ఇతర జిల్లాలకు బదలీలు వచ్చేశాయి. జిల్లా అధికారుల్లోనూ మార్పులు, చేర్పులు చోటు చేసుకుంటున్నాయి. ఇంకోవైపు ఎన్నికల ఓటర్ల ప్రక్రియ నడుస్తోంది. ఎన్నికల సంఘం సూచనల మేరకు ఓటర్ల జాబితాను కలెక్టర్ విడుదల చేశారు. ఇందులోనూ అనేక లోపాలున్నాయంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. వాటిని సరిచేసే పనిలో అధికార యంత్రాంగం ఉంది. ఏదిఏమైనా ఎన్నికల హడావుడి రోజురోజుకూ పెరుగుతూ పోతోంది. అటు రాజకీయంగా, ఇటు అధికార యంత్రాంగం పరంగా సమయత్తమవుతన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

హామీని నిలబెట్టుకున్నాం..

పాదయాత్ర ముగింపు సభలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఎన్నికల ముందు పుట్టపర్తి నియోజకవర్గంలోని చెరువులన్నింటికీ నీరిస్తామని తాను ఇచ్చిన వాగ్దానం మేరకు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయించి హామీని నిలబెట్టుకున్నామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తెలియజేశారు. పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులకు సాగునీరు అందించే దిశగా ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి చేపట్టిన డాక్టర్ వైఎస్సార్ రైతు విజయ సంకల్ప పాదయాత్ర శనివారం ముగిసింది. చివరి రోజు పట్టణంలోని కర్నాటకనాగేపల్లి నుంచి వీరజిన్నయ్య పల్లి, వెంగళమ్మ చెరువు మీదుగా చెర్లోపల్లి వరకు పాదయాత్ర కొనసాగింది. తొమ్మిది రోజులుగా 103 గ్రామాలు మీదుగా 163 కిలోమీటర్లు పాదయాత్ర సాగింది. గత ఎన్నికల సమయంలో 193 చెరువులకు సాగునీరు అందిస్తామని ఎమ్మెల్యే దుద్దుకుంట హామీ ఇచ్చారు. ఇందుకు సంబంధించి ప్రస్తుతం రూ.864 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని, ఈ నేపథ్యంలో పాదయాత్ర ద్వారా ప్రజలు, రైతులకు ఎమ్మెల్యే ఈ విషయాన్ని తెలియజేసేందుకు నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. పాదయాత్రలో నల్లమాడ మండలంలోని నల్లగొండ రిజర్వాయర్ పుట్టపర్తి మండలంలోని గాజులపల్లి రిజర్వాయర్లు స్థాపించడానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల మీదుగా పాదయాత్ర సాగింది. పాదయాత్రలో ఆయా

పైలాన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యేలు శ్రీధర్‌రెడ్డి, శంకరనారాయణ, ఎంపి అభ్యర్థి శాంతమ్మ

గ్రామాలలో ఎమ్మెల్యేకి హారతులు పట్టి వైసిపి శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. శనివారం నాడు చెర్లోపల్లిలో ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటున్నామని చెప్పారు. ఒక ఏడాది లోపల కాలువ పనులు పూర్తవుతాయన్నారు. నిధులు విడుదల చేసిన జగన్మోహన్‌రెడ్డికి నియోజకవర్గ ప్రజల తరపున తాను కతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతాం

పుట్టపర్తి రూరల్ : నియోజకవర్గంలో సాగు, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడమే వైసిపి లక్ష్యమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన 'వైఎస్ఆర్ రైతు విజయ సంకల్ప' పాదయాత్ర ముగింపు సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా అధ్యక్షులు శంకరనారాయణ, హిందూపురం ఎంపి అభ్యర్థి శాంతమ్మ, జడ్పిటిసి లక్ష్మీనరసమ్మ, రాష్ట్ర మహిళా కార్యదర్శి భారతిరెడ్డి, డిఎస్ కేశవరెడ్డి, పుట్టపర్తి మున్సిపల్ ఛైర్మన్ ఓబుళపతి పాల్గొని ప్రసంగించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పుట్టపర్తి, కదిరి, పెనుగొండ ప్రాంతాల నుంచి వలసలను ఆపేందుకు హంద్రీనీవా నీటితో చెరువులను నింపుతామన్నారు. రూ. 864 కోట్ల వ్యయంతో నల్లగొండ, గాజులపల్లి రిజర్వాయర్లు, 9 లిఫ్ట్ పంపుల నిర్మాణాలు చేపట్టామని, ఏడాది లోపు పూర్తి చేసి సాగు, తాగునీరు అందిస్తామన్నారు. టిడిపి, జనసేనపార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. అంతకు ముందు కర్నాటక నాగేపల్లి నుంచి వెంగళమ్మ చెరువు, చెర్లోపల్లి వరకూ పదో రోజు పాదయాత్ర కొన సాగింది. చెర్లోపల్లి సమీపంలో పైలాన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో మహిళా జిల్లా అధ్యక్షురాలు సాయిలీల, కౌన్సిలర్ సాయిగీత, వెన్నపూస ధనుంజయరెడ్డి, ఎంపిపి ఎవి రమణారెడ్డి, ఒడిసి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకురాళ్లు కన్యాకుమారి, ఉషారాణి, నరసారెడ్డి, పుట్టపర్తి, కొత్తచెరువు, నల్లమాడ, అమడగూరు, బుక్కపట్నం, ఒడిసి మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటల సాగు, తెగుళ్లపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి-కదిరి టౌన్

స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానంలో శనివారం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ డి.సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి శిక్షణ, సందర్శన, కార్యశాల, వ్యవసాయ పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి వైవి.సుబ్బారావు అధ్యక్షత వహించగా వివిధ సబ్ డివిజన్ల వ్యవసాయ సహాయ సంచాలకులు, రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం, పుట్టపర్తి ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు హాజర య్యారు. వారు మాట్లాడుతూ మొక్కజొన్నలో కత్తెరపురుగు నివారణపై రైతులకు అవగాహన కల్పిం చేందుకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తామన్నారు. వేరుశనగలో కాండం కుళ్లు తెగులు నివారణ చర్యలను శాస్త్రవేత్త డాక్టర్ వేమన వివరించారు. రెడ్డిపల్లి కెవికె శాస్త్రవేత్త డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ పురుగుమందులను డ్రోన్ ద్వారా పిచికారి చేసుకోవాలన్నారు. ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ప్రసన్నరాజేష్ మాట్లాడుతూ ఖరీఫ్ నాటికి నూతన వేరుశనగ రకాలను అందించేందుకు గ్రామీణ విత్తన పథకం ద్వారా ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు.

సదస్సులో పాల్గొన్న శాస్త్రవేత్తలు

కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ చినరాయుడు, ఏరువాక కోఆర్డినేటర్ రామసుబ్బయ్య, నల్లమాడ, ఒడిసి, తలుపుల, అమడగూరు, ఆర్‌బికె, వ్యవసాయ అధికారులు, రైతులు సుబ్బారెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

రహమత్‌పురంలో 'గడప గడపకూ'

హిందూపురం : పట్టణంలోని రహమత్ పురంలో శనివారం వార్డు ఇన్‌ఛార్జి ఫారూఖ్ ఆధ్వర్యంలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించగా వైసిపి ఇన్‌ఛార్జి దీపిక పాల్గొన్నారు. ఆమె ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు షాజియా, రహమత్‌బి, లక్ష్మీమహేష్‌గౌడ్, నాయకులు నౌషద్, షాజహాన్, అయూబ్ బేగ్, భాను, నవీన్, మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

పెనుకొండ : కుటుంబ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని డిగ్రీ కళాశాలలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి ఎం.శంకర రావు, జూనియర్ సివిల్ జడ్జి ముజీబ్ పసపల సయ్యద్, ఎజిపి ఎం.భాస్కర్‌రెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి.నాగరాజు, ప్రిన్సిపల్ కేశవరావు ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి విద్యార్థులకు రాజ్యాంగంలోని హక్కులు, విధులు, ముఖ్య విషయాలను తెలిపారు. ఎన్నికల్లో ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు.

చోళమాంబదేవి ఆలయానికి విరాళం

అమరాపురం : స్థానిక చోళమాంబదేవి ఉత్సవాలకు శనివారం టిడిపి మాజీ ఎమ్మెల్యే కే.ఈరన్న రూ. 50 వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. వారం రోజుల పాటు జరిగే ఉత్సవాలకు కర్నాటక, ఆంధ్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వస్తారు.

నేడు పత్తికొండలో 'రా కదలిరా'

మడకశిర : కర్నూలు జిల్లా పత్తికొండలో ఆదివారం టిడిపి అధినేత చంద్రబాబు చేపట్టిన 'రా కదిలిరా' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, మంత్రాలయం నియోజకవర్గ పరిశీలకులు గుండుమల తిప్పేస్వామి పిలుపునిచ్చారు. ఈ విషయమై శనివారం గుండుమల మంత్రాలయం నియోజకవర్గంలోని పెద్దకడబూరు మండలంలో ఇన్‌ఛార్జి తిక్కారెడ్డితో కలిసి చర్చించారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ధర్మవరం టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ అధ్యక్షులు గూడూరు మోహన్ దాస్, కార్యదర్శి రాజగోపాల్, కోశాధికారి వేణుగోపాలాచార్యులు తెలిపారు.

మడకశిర : పట్టణంలోని సర్వోదయ జూనియర్ కాలేజీలో ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు డిహెచ్‌పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎంఆర్ హనుమంతు తెలిపారు.

'బత్తల' ఆర్థికసాయం

కదిరి టౌన్ : గాండ్లపెంట మండలంలోని కోటూరుకు చెందిన వడ్ర సిద్దయ్య పక్షవాతంతో బాధపడుతున్నాడు. ఈ విషయ తెలిసి వైసీపీ రాష్ట్ర బీసీ విభాగం ఉపాధ్యక్షులు డాక్టర్ బత్తల హరిప్రసాద్ రూ. 5వేలు అందజేశారు. కార్యక్రమంలో మాలమీదపల్లి వైసిపి నాయకులు పి.భాస్కర్, బత్తల యువసేన సభ్యులు ముబారక్, జెరిపిటి హరి, నాగేశ్వర్, వి.భాస్కర్ పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ

కొత్తచెరువు : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నతమైన స్థానాలకు ఎదగాలని జిల్లా వృత్తి విద్య అధికారి లాజర్ సూచించారు. ఆయన శనివారం స్థానిక బిసి హాస్టల్‌ను సందర్శించారు. పదో తరగతి పరీక్షల్లో ప్రతి ఒక్కరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. మెనూ ప్రకారమే భోజనం ఇస్తున్నారా అని ఆరా తీశారు. ఆయన వెంట హాస్టల్ వార్డెన్ నాగేందర్‌సింగ్, సిబ్బంది ఉన్నారు.

ఇళ్ల స్థలాల సర్వేలో నిర్లక్ష్యం వద్దు : సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-హిందూపురం

పురపాలక సంఘం వ్యాప్తంగా ఇంటి స్థలాల కేటాయింపుపై జరుగుతున్న సర్వేలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని సబ్ కలెక్టర్ అపూర్వభరత్ హెచ్చరించారు. పట్టణంలోని పురపాలక సంఘం కార్యాలయంలో జరుగుతున్న సర్వేను శనివారం సబ్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఆ సమయంలో కొందరు సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై స్థానిక అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్న సిబ్బందితో వార్డుల వారీగా సర్వే వివరాలు తెలుసుకున్నారు. ' అందరికీ ఇళ్లు' పథకం కింద కేటాయించిన ఇంటి స్థలాలకు సంబంధించి ప్రతి ప్లాటు చెక్కు బందిని సాయంత్రంలోగా ఆన్‌లైన్‌లో

సర్వేను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ అపూర్వ భరత్

పొందుపరచాలని విఆర్‌ఒ, వార్డు ప్లానింగ్, అడ్మిన్ సెక్రటరీలను ఆదేశించారు. నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో తహశీల్దార్ స్వర్ణలత, ఆర్ఐ అమరేంద్ర, మున్సిపల్ మేనేజర్ రామాంజనే యులు పాల్గొన్నారు.

అధికారుల సహకారంతోనే అభివృద్ధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-గాండ్లపెంట

అధికారుల సహకారంతోనే మండలంలో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ జగన్‌మోహన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. గ్రామాలకు తారు రోడ్డు సౌకర్యం కల్పించామన్నారు. మండలంలో హంద్రీనీవా పనులను ప్రారంభిస్తామన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలు, రైతులను ఇబ్బందులు పెడుతున్న తహశీల్దార్‌ను బదిలీ చేయాలని సభ్యులు కోరారు. సమావేశంలో జిల్లా కోఆప్షన్ సభ్యుడు ఎస్.ఫయాజ్ అలీ, ఎంపీడీవో కే.రామనాయక్, ఈఓఆర్‌డి సునీత, ఎంఈఓ కృష్ణనాయక్, పశువైద్యాధికారి చెన్నకేశవనాయక్, ట్రాన్స్‌కో ఏఈ విశ్వనాథం, ఏవో లక్ష్మీ ప్రియమంజునాథ్, ఆర్‌డబ్ల్యూ ఎస్ జేఈ కరణ్ కుమార్‌రెడ్డి, పిఆర్‌జెఈ రెడ్డి ప్రసాద్, వైస్ ఎంపీపీ గంగోజమ్మ భారతి, ఎంపీటీ సీలు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి

సంక్షేమం, అభివృద్ధిపై ఎమ్మెల్యే సమీక్ష

నల్లచెరువు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల స్థాయి సర్వసభ్య సమావేశంలో కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి.సిద్ధారెడ్డి పాల్గొన్నారు. ముందుగా వైసిపి మండల ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేకి పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. సమావేశంలో ఎమ్మెల్యే వివిధ శాఖల అధికారులతో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శకుంతల, ఎంపీపీ రమణారెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్ జలకళ మోటార్లు, స్టార్టర్లు అందజేత

రొద్దం : 'వైఎస్ఆర్ జలకళ' పథకంలో భాగంగా శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎంపిపి చంద్రశేఖర్ మండలంలోని గౌరాజుపల్లి గ్రామానికి చెందిన హనుమంతు, పెద్దగువ్వలపల్లికి చెందిన బండారు క్రిష్టప్పకు మోటార్లు, స్టార్టర్ పెట్టెలు అందజేశారు. ఎంపిపి మాట్లాడుతూ సిఎం జగన్ రైతు పక్షపాతి అని అన్ని విధాలుగా ఆదుకుంటున్నారన్నారు. ఉచితంగా బోర్లు వేయించి అవసరమైన సామగ్రి కూడా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎఒ చంద్రశేఖర్, ఎపిఒ రషీద్, వైసిపి నాయకులు బి.నారాయణరెడ్డి, అంజనరెడ్డి, బోయ నరసింహులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణ అందరి బాధ్యత

పుట్టపర్తి రూరల్ : అడవులను సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పర్యావరణవేత్త డాక్టర్ భాస్కర్‌నాయుడు పేర్కొన్నారు. మండల పరిధిలోని పెడపల్లి గ్రామంలో శనివారం అడవులు అగ్నికి ఆహుతి కాకుండా కాపాడాలని ప్రజలకు అవగాహన కల్పించారు. చిత్రావతి నది పరిసర ప్రాంతాల్లోని అడవులు అంతరించిపోకుండా కాపాడుకోవాలని, అడవుల విశిష్టత తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమం లో రామచంద్ర, భాస్కర్‌రెడ్డి, హరి, పెడపల్లి, పెడపల్లితండా గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల శ్రమదానం

హిందూపురం : శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం సౌజన్యంతో బాలయేసు డిగ్రీ కళాశాల ప్రోగ్రాం అధికారి హరీష్ ఆధ్వర్యంలో కొత్త కాపులపల్లి గ్రామంలో శనివారం విద్యార్థులు డ్రెయినేజీ కాలువల్లో చెత్త చెదారం తొలగించి, దోమలు, ఈగలు నివారణకు బ్లీచింగ్ పౌడర్ చల్లారు. ప్రిన్సిపల్ డా. జియావుల్లాఖాన్ మాట్లాడుతూ ఇలాంటి క్యాంపుల ద్వారా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు శివరామరెడ్డి, అశ్వర్థనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్పేస్ కాలేజీ వార్షికోత్సవం

కదిరి టౌన్ : రూరల్ మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లిలో శనివారం స్పేస్ కాలేజీ 20వ వార్షికోత్సవాన్ని కరస్పాండెంట్ ఎమ్మెస్ కిరణ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా గ్రూప్-1 ఆఫీసర్లు జ్ఞానానందరెడ్డి, కవిరాజ కార్తీక్ హాజరై మాట్లాడారు. స్పేస్ కళాశాలలో విద్యనభ్యసించిన ఎంతోమంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ ఎమ్మెస్ ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాన్ని చేరుకునేందుకు కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతి కార్యక్రమాలు అందరినీ అలరింప చేశాయి.

వైసిపికి అండగా ఉందాం

ముదిగుబ్బ : నూర్‌బాషా ముస్లిం దూదేకుల రాష్ట్ర కార్పొరేషన్ ఛైర్మన్ ఒ.రసూల్ శనివారం పులివెందుల నుం చి అనంతపురం వెళ్తూ మార్గమధ్యలో పట్టణంలోని మండల కో ఆప్షన్ సభ్యులు చిన్న బాలముని నివాసానికి వెళ్లారు. ఆయన మాట్లాడుతూ నూర్‌బాషా దూదేకుల కులస్తులు వైసిపికి అండగా ఉండి వచ్చే ఎన్నికల్లో గెలిపించాలని కోరారు. దూదేకులకు షాదీ తోఫాను రూ. లక్షకు పెంచింది. ఎమ్మెల్యే, ఎంపి సీట్లు కేటాయించిన ఘనత సిఎం జగనే అన్నారు. కార్యక్రమంలో నిస్సార్ అహ్మద్, కుళ్లాయప్ప పాల్గొన్నారు.

సిఐ మోహన్

సిఐ రాజారమేష్

బాధ్యతలు స్వీకరించిన సిఐలు

కదిరి అర్బన్ : కదిరి అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ నూతన సిఐగా మోహన్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ యువత సరైన మార్గంలో నడిచి ఉన్నత స్థాయికి చేరుకుని తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలను అరికడతామన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు.

కొత్తచెరువు : కొత్తచెరువు అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ నూతన సిఐగా రాజారమేష్ సర్కిల్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. పెనుగొండలో సిఐగా పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు ఇక్కడ పనిచేస్తున్న సిఐ రాగిరి రామయ్య పుట్టపర్తి రూరల్‌కు బదిలీ అయ్యారు. నూతన సిఐ మాట్లడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. త్వరలో ఎన్నికల నోటిఫికేషన్ వెలవడుతున్నందున గ్రామాల్లో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పిస్తామనన్నారు.

నేడు 'అనంత'లో షర్మిల సమావేశం

మడకశిర : ఈ నెల 28వ తేదీ అనంతపురం నగరంలో నిర్వహిస్తున్న ఎపిసిసి అధ్యక్షురాలు షర్మిల సమావే శాన్ని జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే సుధాకర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని కోల్డ్ స్టోరేజ్‌లో శనివారం మండల కన్వీనర్ మంజునాథ్ అధ్యక్షతన నగర పంచాయతీ అధ్యక్షుడు బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో పార్టీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సుధాకర్ మాట్లడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ బలపడుతుందన్నారు. షర్మిల చేరికతో రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయన్నారు. వైఎస్ఆర్ ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ పని చేయాలన్నారు. అనంతరం మండల, పట్టణ కాంగ్రెస్ కమిటీలు, పంచాయతీ అధ్యక్ష, కార్యదర్శులతో కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు జి.ప్రభాకర్‌రెడ్డి, నరసింహ మూర్తి, దిన్నేహట్టి నాగరాజు, వెంకటేష్, కన్వీనర్లు గురుమూర్తి, లోకేష్, గౌడప్ప పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు భూమిపూజ

మడకశిర : పట్టణంలోని పాత ఎస్సీ కాలనీ 17వ వార్డులో శనివారం కమిషనర్ ప్రభాకర్ రావు ఎఇ మురళి సీసీ రోడ్డుకు భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ ఎస్సీ కాలనీ వాసుల ఇబ్బందుల దృష్ట్యా ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆదేశాల మేరకు పనులను ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సుభద్రనాగేంద్ర, బలరామ్, అన్సార్, శ్రీనివాస్, గోపి, నగేష్, కవిత, పాల్గొన్నారు.

విద్యార్థులకు టీ షర్ట్స్ పంపిణీ

లేపాక్షి : స్థానిక గురుకుల పాఠశాలలో 1999లో పదో తరగతి చదివిన నటరాజ్ సొంతంగా సాఫ్ట్ వేర్ ట్రైనింగ్ సెంటర్ నడుపుతున్నాడు. ఆయన పాఠశాలలోని విద్యార్థులకు శనివారం టీ షర్ట్స్ పంపిణీ చేశారు. ఏటా మెరిట్ విద్యార్థులకు తనవంతు సాయం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో నటరాజ్ కుటుంబ సభ్యులు ప్రకాష్, శాంతమ్మ, రోహిణి, ఆద్య పాఠశాల కమిటీ ఛైర్మన్ రామాంజనేయులు, ఉపాధ్యాయులు విద్యార్థుల, పాల్గొన్నారు

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలి

లేపాక్షి : 'ప్లాస్టిక్ రహిత సమాజం' ఏర్పాటు చేయాలని నినాదాలు చేస్తూ శనివారం విద్యార్థులు పురవీధుల గుండా నంది విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించారు. ప్రజలు కు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువులు వాడితే అనారోగ్యం బారిన పడతారని, వాటిని నిషేధించాలని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల పాల్గొన్నారు .

టిడిపి బూత్ కన్వీనర్లకు శిక్షణ

రొద్దం : మండలంలోని ఆర్.మరవపల్లిలోని టిడిపి జిల్లా అధ్యక్షులు బికె.పార్థసారధి నివాసంలో బికె సాయికల్యాణ్ ఆధ్వర్యంలో బూత్ కన్వీనర్లకు ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణ అధికారి నవీన్ ఓటరు జాబితాలో దొంగ ఓట్లు, డబుల్ ఎంట్రీలను గుర్తించడంపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, నాయకులు చిన్నప్పయ్య, నరహరి, బేబీ, హరీష్, మురళీ, రామకృష్ణ, హరికృష్ణ, షణ్ముఖ, నాగరాజు, అంజనప్ప, రాజప్ప, కేశప్ప, తమ్మయ్య, రామాంజి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనసేన పార్టీ బలోపేతానికి కృషి

పుట్టపర్తి క్రైమ్ : జనసేన పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని కదిరి బ్లూమూన్ గ్రూప్ సంస్థల అధినేత మంచి శివశంకర్ తెలిపారు. ఆయన శనివారం పుట్టపర్తి పట్టణంలో పర్యటించగా స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికి సన్మానించా రు. ఆయన మాట్లాడుతూ పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ కార్యకర్తలకు అండగా ఉంటారన్నారు. కార్యక్రమంలో కదిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి భైరవప్రసాద్, పుట్టపర్తి నియోజకవర్గ నాయకులు డాక్టర్ తిరుపతేంద్ర, రాము, ఆంజనేయులు, మండల అధ్యక్షుడు పెద్దన్న, మహేష్, మారుతి, వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

ప్రతి విద్యార్థి చదువులో రాణించి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని సత్యసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ప్రొఫెసర్ క్రిష్ణకిరణ్ వంశీదాస్, పాఠశాల ఛైర్మన్ శంకరనారాయణ, ఎంఇఒ గోపాల్ నాయక్ డైరెక్టర్లు

హయర్ లర్నింగ్ కళాశాల ప్రొఫెసర్ క్రిష్ణకిరణ్ వంశీదాసు, ఎంఇఒ గోపాల్నాయక్, పాఠశాల ఛైర్మన్ శంకర నారాయణ సూచించారు. పట్టణంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవపురంలో ఉన్న యశోద కాన్సెప్ట్ పాఠశాల 16వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. తొలుత ముఖ్యఅతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రతివిద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించి భవిష్యత్తులో ఉన్నతస్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం గతేడాది పదో తరగతి పరీక్షల్లో 10 గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులకు జ్ఞాపికతో పాటు రూ. 5వేలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రవీంద్ర, పృథ్వీరాజ్, ప్రిన్సిపల్ అనూప్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉద్యోగుల నిరవధిక నిరాహార దీక్ష

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

పట్టణంలోని డిఆర్‌డిఒ జిల్లా కార్యాలయం వద్ద శనివారం జెఎసి ఆధ్వర్యంలో సెర్ప్ ఉద్యోగులు నిరవధిక నిరాహార దీక్షలను ప్రారంభించారు. దీక్షల్లో వెలుగు సీసీలు గోరంట్ల రామాంజులు, ఒడిసి చంద్రారెడ్డి, ముదిగుబ్బ రామాంజనేయులు, కొత్తచెరువు శ్రీరామ్‌నాయక్, మడకశిర లక్ష్మీనరసప్ప కూర్చున్నారు. వీరికి మద్దతుగా డిఆర్‌డిఎ, ఐకెపి, సెర్ప్ ఉద్యోగులు శిబిరంలో కూర్చున్నారు. ఉద్యోగం సంఘం నాయకుడు రామాంజనేయులు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ప్రస్తుతం ఉన్న ఈపిఎఫ్‌ను తొలగించి, మూల వేతనంతో వంద శాతం ఈపిఎఫ్ అమలు చేయాలని, అర్హులందరికీ ప్రమోషన్లు కల్పించాలని, మృతిచెందిన ఉద్యోగుల కుటుంబాల్లో కారుణ్య నియామకాలు చేపట్టాలని,

నిరవధిక సమ్మె చేపట్టిన సెర్ప్ ఉద్యోగులు

రిటైర్మెంట్ వయసు 62కు పెంచాలని, విఒల గౌరవ వేతనం 15 వేలకు పెంచాలని, గ్రాట్యుటీ, హెచ్‌ఆర్ అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జెఎసి కన్వీనర్ రామేశ్వర్‌రెడ్డి, కో కన్వీనర్, ఎబిఎన్ నారాయణ, సీసీలు రామ్మోహన్, శంకర్, సూర్యనారాయణ, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'పొదుపు' భవిష్యత్తుకు మార్గదర్శకం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పొదుపు భవిష్యత్తుకు మార్గదర్శకం అవుతుందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర క్రీడా మైదానంలో శనివారం మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మెప్మా అర్బన్ మార్కెట్ స్టాల్స్‌ను సందర్శించారు. 10,810 మంది డ్వాక్రా సంఘం సభ్యులకు రూ. 9,00,16,742 మెగా చెక్కును సంఘాల సభ్యులకు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ డ్వాక్రా మహిళా సంఘాల సభ్యులు పొదుపునకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినప్పుడే కుటుంబం పదిలంగా ఉంటుందన్నారు. అనంతరం సిఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మానస అకాడమీ ఆధ్వర్యంలో చేసిన నృత్య ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో

మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి

మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి, కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, మెప్మా టీఎంసీ వెంకటేశులు, మెప్మా టిపిఆర్‌ఒ సుబ్బరాయుడు, వైస్ ఛైర్మన్లు వేముల జయరామిరెడ్డి, శంషాద్ బేగం, కో ఆప్షన్ సభ్యులు, మేనేజర్ ఆనంద్‌కుమార్ సిబ్బంది రాజేష్‌నాయక్, మల్లికార్జున, సిఒలు, ఆర్పీలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి-కదిరి టౌన్

పుట్టపర్తి పట్టణంలోని పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించిన రిపబ్లిక్ డే వేడుకల్లో కదిరి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఎంవిఐ) వరప్రసాద్ జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి నుంచి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. దీంతో శనివారం కదిరి డ్రైవింగ్ స్కూల్స్ యాజమాన్యాల ఆధ్వర్యంలో ఎంవిఐ వరప్రసాద్‌ను స్థానిక మోటార్ వాహన తనిఖీ అధికారి కార్యాలయంలో పూలమాలలతో ఘనంగా సన్మానించారు. వరప్రసాద్ మాట్లాడుతూ ఉత్తమ సేవా పురస్కారం లభించడం సంతోషంగా ఉందని, విధుల పట్ల మరింత బాధ్యత పెరిగిందన్నారు. కార్యక్రమంలో మహబూబ్ డ్రైవింగ్ స్కూల్ యజమాని ఫారుకీ ఆజామ్, మాస్టర్ హైదర్ వలీ, ఇర్ఫాన్, షాజహాన్, సుధాకర్, ముదిగుబ్బ

ఎంవిఐ వరప్రసాద్‌ను సన్మానిస్తున్న డ్రైవింగ్‌స్కూల్ యాజమాన్యాలు

గురుమూర్తి, షేక్షావలి పాల్గొన్నారు.

కొత్తచెరువు : ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ చంద్రమౌళి, ఎస్ఐ సురేష్‌బాబు జిల్లా స్థాయి ఉత్తమ అవార్డును కలెక్టర్ అరుణ్‌బాబు నుంచి అందుకున్నారు. వారి వారి రంగాల్లో ఉత్తమ సేవలు అందించినందుకు వారికి అవార్డులు దక్కాయి.

మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని గాంధీ నగర్‌లో ట్యాంక్ వద్ద శనివారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో మున్సిపల్ పారిశుధ్య కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్, సిఐటియు ప్రధాన కార్యదర్శి అయూబ్‌ఖాన్, ట్రాన్స్‌పోర్ట్ రంగం రాష్ట్ర నాయకులు రఫీ పాల్గొన్నారు. నూతన కమిటీ గౌరవ సలహాదారులుగా చెన్నకేశవులు, రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రసాద్, అధ్యక్షులుగా బాబు, ఉపాధ్యక్షులుగా పెద్దక్క, ఓబుళప్ప, ప్రధాన కార్యదర్శిగా ముకుంద, సహాయ కార్యదర్శిగా చంద్రశేఖర్, కోశాధికారిగా లక్ష్మీ ఓబులేశును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం విధి నిర్వహణలో మృతి చెందిన ఔట్‌సోర్సింగ్ కార్మికులు గూడూరు బాబు కుటుంబానికి రూ. 37,800, క్యాన్సర్ బారిన పడిన డి.నాగేంద్రకు రూ. 6,500లను సిఐటియు నాయకుల ద్వారా అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బాబు, ముకుంద, చెన్నకేశవులు, పెద్దక్క, ఓబుళప్ప, కార్మికులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

పెనుకొండ : మండల పరిధిలోని అమ్మవారుపల్లి సమీపంలో శనివారం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతిచెందాడు. పోలీసులు వివరాల మేరకు.. మండలంలోని వెంకటగిరి పాళ్యం గ్రామానికి చెందిన కురువ పోతన్న(78) గుట్టూరు గ్రామం నుంచి సొంత గ్రామం వెళ్లేందుకు కోటక్ కంపెనీ ఎదురుగా జాతీయ రహదారి దాటుతుండగా అనంతపురం నుంచి పెనుకొండ వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కియా పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ ప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళా రైతు

బనల్లమాడ : మండలంలోని ఎర్రవంకపల్లె గ్రామానికి చెందిన మహిళా రైతు వి.నారాయణమ్మ (50) శనివారం విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. భర్త బాలాజీ నాయక్ తెలిపిన వివరాలు.. ఇంట్లో విద్యుత్ మోటారు వైరు షాక్ కొట్టడం వల్ల అపస్మారక స్థితిలో పడిపోయిందన్నారు. వెంటనే అంబులెన్స్ ద్వారా కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందిందని నిర్ధారించారు. ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు.

కర్నాటక మద్యం పట్టివేత

పుట్టపర్తి రూరల్ : జిల్లా వ్యాప్తంగా శనివారం సెబ్ పోలీసులు దాడులు నిర్వహించి కర్నాటక మద్యం, బైక్ స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. పుట్టపర్తి, పెనుకొండ, మడకశిర సెబ్ స్టేషన్ల పరిధిలో 2 చొప్పున, ధర్మవరం, సికె.పల్లి, కదిరి సెబ్ స్టేషన్ల పరిధిలో ఒక్కో కేసు నమోదు చేయడంతో పాటు కర్నాటక మద్యం స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్లలో అప్పగించారు.

మట్టిటిప్పర్లు సీజ్

పరిగి : స్థానిక చెరువు నుంచి శుక్రవారం రాత్రి అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను పోలీసులు సీజ్ చేసి కేసు నమోదు చేశారు. రాత్రి వేళ అక్రమంగా మట్టి తరలిస్తున్నట్లు పెనుగొండ సిఐ యుగంధర్‌కు సమాచారం అందింది. సిఐ ఆదేశాల మేరకు పరిగి పోలీసులు మట్టి తరలిస్తున్న రెండు టిప్పర్లను పట్టుకుని స్టేషన్ కు తరలించారు.

గడ్డివామి దగ్ధం

సోమందేపల్లి : మండలంలోని పత్తికుంటపల్లి గ్రామంలో శనివారం ఆదిమూర్తిరెడ్డి కుమారుడు రైతు మంజునాథ్‌రెడ్డికి చెందిన గడ్డివామి దగ్ధమైంది. మంజునాథ్‌రెడ్డి పశువుల మేత కోసం 5 ట్రాక్టర్ల గడ్డి(మొక్కజొన్న, వేరుశనగ)ని వామిగా వేశాడు. అయితే మధ్యాహ్నం ఒంటి గంట ప్రాంతంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో గడ్డివామి దగ్ధమైంది. వారు 20 మీటర్ల మోటార్ కేబుల్ వైరును ఎత్తుకెళ్లారని బాధత రైతు వాపోయాడు.

CHANGE OF NAME

I, Talupula Shafiq (Old Name) S/o. Talupula Sabjan, Residing at D.No. 9-488-22-1C, Noorkhan Street, Kadiri Town, Sri Sathya Sai Dist. A.P. - 515 591. changing my name from Talupula Shafiq (old name) to **TALAPULA MAHAMMED SHAFIQ** (new name). Hence forth I am being called as **TALAPULA MAHAMMED SHAFIQ** for all purposes.

CHANGE OF NAME

I, Talupala Shaik Shameem my husband name Talupula Shaik Shafiq (Old Name) Residing at D.No. 9-488-22-1C, Noorkhan Street, Kadiri Town, Sri Sathya Sai Dist. A.P. - 515 591. changing my husband name from Talupula Shaik Shafiq (old name) to **TALAPULA MAHAMMED SHAFIQ** (new name). Hence forth my husband name being called as **TALAPULA MAHAMMED SHAFIQ** for all purposes.